# 8. క్రికెటోపాఖ్యానం

క్రికెట్ మీద మోజు అనేది ఈనాడేగాదు. నలభై యేళ్ళ క్రిందటా భారతదేశంలోనూ జోరుగానే ఉండేది.

ఆనాడు రాజాలూ, మహారాజాలూ ప్రత్యేకించి ఈక్రీడను పోషించి పేరు ప్రఖ్యాతులకు బారలుజాపే వారు. ఎందుకంటే అది మహనీయులైన యూరోపియన్ల క్రీడగా జగత్ప్రసిద్ధం.

ఆనాడు కూడా క్రికెట్‌లో బ్రిటన్, ఆస్ట్రేలియాలే అగ్రస్థానంలో ఉండి ఎవరినైనా సరే సవాల్ చేయగల సత్తాతో ఉండేవి. కనుక భారత దేశంలోనూ కాశ్మీర్, కపుర్తలా, పాటియాలా వంటి పెద్ద సంస్థానాధీశులు కూడా అదే మార్గంలో మంచి క్రికెట్ టీములను తయారుజేయ బూను కొన్నారు.

పాటియాలా మహారాజా భూపేంద్రసింగ్ కెప్టెన్‌గా ఓ మంచి టీంను తయారుజేసి దేశ విఖ్యాతుడైనాడు. సదరన్ పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ సంస్థాపకుడుగా, ఛీఫ్‌ప్యాట్రన్‌గా, దేశ విదేశాల్లోని ముఖ్య మైన క్రికెట్ సంస్థలలో ప్రముఖ సభ్యుడుగా మహారాజావారు క్రికెట్ రంగంలో సుప్రసిద్ధులుగా ఉండేవారు.

అయితే, ఇది ఆనాడు వైస్రాయిగానున్న లార్డ్ విల్లింగ్‌టన్‌కు కంటక ప్రాయంగా తయారయింది. ఓ భారతీయుడు క్రికెట్ రంగంలో అలా వెలిగి పోవటాన్నతను సహించలేక పోయాడు. భారతదేశపు క్రికెట్ వ్యవహారాలూ, అధికారాలూ అన్నీ తన అజమాయిషి క్రిందనే ఉండా లనేది విల్లింగ్‌టన్ వాంఛ.

దాంతో అతను క్రమంగా మహారాజా భూపేంద్ర సింగ్‌ను వ్యక్తిగతంగా ద్వేషిస్తూ, ఎలాగైనా క్రిందికి దింపి వేయాలని ప్రయత్నించేదాక వచ్చేడు. ఈ కక్ష రాజకీయాలలో కూడా ప్రతిఫలించ సాగింది.

ఇలా ఉండగా పాటియాలాలో ఇంటర్నేషనల్ క్రికేట్ మాచ్ ఒకటి ఏర్పాటయింది. అందులో పాటియాలా టీముతో ఆడేందుకుగాను దిగిన బ్రిటిష్‌టీములో హేమా హేమీలైన ఆటగాళ్ళున్నారు.

వారితో పోలిస్తే పాటియాలా మహారాజావారి టీం ఏమంత చెప్పుకో దగ్గది గాదు. కాని, ఈ మ్యాచిలో ఎలాగైనా గెలిచితీరాలనీ, ఆవిధంగా లార్డ్ విల్లింగ్‌టన్ నోరుమూయించి అదుపులో ఉంచాలనీ మహారాజావారి క్రికెట్ సలహాదారులూ, రాజకీయ సలహాదారులూ కూడా పట్టుదలగా మహారాజావారికి నూరి పోసేరు, మహారాజావారునూ సలహాదార్లతో రహస్యంగా, దీర్ఘంగా, సుదీర్ఘంగా ఆలోచించారు. చివరికి పథకం తయారయింది. బ్రిటిష్ టీం పాటియాలాలో దిగగానే వారికి ఘనమైన, రాజోచిత మర్యాదలతో కూడిన స్వాగతం ఇవ్వబడింది. దేవేంద్ర భవనం లాంజి అతిధిగృహంలో అపూర్వమైన అతిధ్యం ఏరాప్టయింది.

బ్రిటీష్ టీం గౌరవార్థం క్రికెటు మ్యాచ్‌కు ముందు రోజు రాజ భవనంలో బ్రహ్మాండమైన విందు చేయబడింది. బ్రిటిష్‌టీంతో పాటు మహారాజావారి టీం సభ్యులూ, బహు కొద్దిమండి ఇతరులూ ఆ విందులో పాల్గొన్నారు. మహారాజావారి పాకశాస్త్ర నిపుణులా రోజున డజన్ల రకాల అత్యంత రుచికరమైన వంటకాలను బ్రిటిష్ వారిని ఆశ్చర్యచకితుల్ని చేసేలా రూపొందించేరు. ఖరీదయిన విదేశీ పానీయాలు గుట్టలుగా సరఫరా చేయబడినాయి.

బ్రిటిష్ క్రికెటర్లు తమ జన్మ ధన్యమయిపోయిందని సంతోషించారు. అసలు వారు మహారాజావారి వైభోగాన్నీ, రాజభవన ఆడంబరాల్నీ చూసే దాదాపు తలతిరిగి పోయి ఉన్నారు

వారలా పీకలదాకా తిని త్రాగుతుండగా అప్సరసల్లాంటి మహారాజావారి ఆస్థాన నర్తకీమణులు అద్భుతంగా నృత్యంజేసి మైమరపింప చేశారు. వారలా దివ్యమైన భోగాన్ననుభవించి లేచేసరికి దాదాపు తెల్లవారవచ్చింది.

మహారాజావారి అంగరక్షకులు వారందరినీ భద్రంగా అతిథి గృహానికి చేరవేశారు.

మర్నాడుదయం క్రికెట్ మాచ్ అరంభ మయేసరికి మహారాజా వారి టీం ప్లే గ్రౌండులో సర్వసన్నద్ధంగా ఉంది మహారాజావారి రహస్య సందేశంపై వారెవరూ రాత్రివిందులో సరిగా తిననూలేదు, త్రాగనూలేదు. పైగా పెందరాళే వెళ్ళి సుఖంగా నిద్రబోయేరు.

బ్రిటిష్ టీంలోని మహామహులైన ఆటగాళ్ళు మాత్రం నిద్ర మత్తులో, విస్కీనిషాలో తూగుతూనే ఆటకు తయారై వచ్చారు.

పాటియాలా జింఖానా క్లబ్‌లో వేలాది ప్రజల సమక్షంలో ఆ అపూర్వమైన క్రికెట్‌మాచ్ ఆరంభమయింది.

మహారాజావారి ఆర్కెస్ట్రా వియన్నానుండి ప్రత్యేకంగా ఈ పని మీద వచ్చిన ప్రఖ్యాత సంగీత కారుడు మాక్‌గాగర్ పర్యవేక్షణలో వీనుల విందైన సంగీతంతో అందర్నీ అలరించింది, బ్రిటిష్ టీం లోనివారు మేఘాలమీద తేలిపోతున్నట్లే భావించుకుని అలాగే ఆడేరు

ఫలితంగా మహారాజావారి టీం సునాయాసంగా ఆ రోజు ఆటను గెలుచుకున్నది. బ్రిటిష్ వారికి మాత్రం అదేమీ పట్టనేలేదు.

ఆట అవగానే అక్కడికక్కడే ఓ చిన్నసైజు విందు ఏర్పాటై

అందరికీ మరలా పానీయాలు దండిగా సరఫరా చేయబడినాయి.

ఈ క్రికెట్ ఆ మ్యాచ్ జరిగిన అయిదు రోజులూ వరుసగా ప్రయోగించబడింది.

అనుదినం రాత్రివేళ మహారాజావారు బ్రిటిష్ టీం గౌరవార్థం ఖరీదైన విందులు ఏర్పాటు చేశారు. ఒకరోజు వండిన పదార్థాలు మరో రోజు వండకుండా మహారాజా వారి వంటగాళ్లు రికార్డునే సృష్టించేరు. రకరకాల నిషా పానీయాలు ఎంతో ఖర్చుతో దిగుమతయ్యాయి. ఆ అయిదు రోజులూ బ్రిటిష్ టీం దేవేంద్ర భోగా లనుభవించింది. ఆ భోగాలముందు క్రికెట్ ఆట అనేది వారికి అల్ప విషయంగా తయారయింది.

అయిదు రోజులూ బ్రిటిష్ టీం శుభ్రంగా ఓడిపోవటం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. మహారాజావారి టీం ప్రజ్ఞాపాటవాల కందరూ జోహార్లర్పించేరే గాని, అసలు రహస్యం మహారాజావారికీ, వారి టీం సభ్యులకూ, మహారాజావారి అంతరంగికులు బహు కొద్దిమందికీ తప్ప తెలియదు.

అయిదురోజులూ పూర్తవగానే బ్రిటిష్ టీంకు మహారాజావారు మరో దివ్యమైన విందునిచ్చి సగౌరవంగా సాగనంపేరు; వారూ-వదలలేక పాటియాలా నుండి వీడ్కోలు పుచ్చుకున్నారు.

మహారాజావారి టీం బ్రిటిష్ టీంపై సాధించిన ఘన విజయాన్ని దేశ విదేశాల్లోని పత్రికలు ప్రముఖంగా ప్రకటించటంతో మహారాజావారి కీర్తి ఖండాంతరాల్లో కూడా ప్రాకిపోయింది.

వైస్రాయ్ వెల్లింగ్టన్ మహాశయుని ముఖం చిన్నవోయింది.

ఈ వార్తరాని పత్రికలలో మహారాజావారి మనుషులు అడ్వర్టయిజుమెంటుగానైనా సరే సచిత్రంగా ప్రకటింప జేసుకుని మరీ సంతృప్తి పడ్డారు.

★